## టీడబ్ల్యూజెఎఫ్ 'మీడియా డైరీ' ఆవిష్కరణ




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## కేడీసీలో ఉద్యోగుల సమస్యలపై భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 111 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 18 ఏప్రిల్ 2026


## మనస్సాక్షిగా మహిళా బిల్లుకు
# మద్దతు ఇవ్వండి

● మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో పెద్ద అవకాశం ● మహిళలను గౌరవించేందుకు సమిష్టిగా కృషి చేద్దాం ● ఎంపిలకు ప్రధాని మోడీ పిలుపు



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతివ్వాలని ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యులంతా తమ మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో గొప్ప అవకాశమని ఆయన కొనియాడారు. మహిళలకు తగిన హక్కులను కల్పించడంలో అందరం సమష్టిగా చరిత్ర సృష్టించాలన్నారు. ఏకాభిప్రాయంతో ఈ సవరణను ఆమోదించాలని, దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఎక్స్ వేదికగా ప్రధాని కోరారు. 'నేను ఎంపీలందరినీ కోరేది ఒక్కటే.. మీ ఇంట్లోని తల్లిని, సోదరిని, కుమార్తెను, భార్యను గుర్తుంచుకుని.. మీ మనస్సాక్షి చెప్పిందే వినండి. మిగతా2లో...

## 2023లోనే ఆమోదించిన బిల్లును
# అమలు చేయండి

- లేదా కొత్తగా మహిళా బిల్లును తీసుకుని రండి
- ప్రస్తుత బిల్లు మహిళా సాధికరత కోసం పెట్టింది కాదు
- ఆ ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం
- బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల క్రూర చర్య
- చర్చలో మోడీ ఓ మెజీషియన్ అంటూ రాహుల్ తీవ్రంగా విమర్శలు
- రాహుల్ తీరుపై మండిపడ్డ స్పీకర్ బిర్లా..కేంద్రమంత్రులు



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇప్పటికే 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు. ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట మిగతా2లో...

## రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్ములా...

- ఉత్తరాది, దక్షిణది పేరుతో విషం చిమ్ముతున్నారు
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి




## సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆర్టిజన్లు

- విద్యుత్ శాఖ ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి
- సిఎండితో చర్చలకు ఆదేశించిన డిప్యూటీ సీఎం



**హైదరాబాద్,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ట్రాన్స్కో సీఎం డి తో మా సమస్యల పై చర్చించేందుకు డిప్యూటీ సీఎం ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్ లో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించిన డిప్యూటీ సీఎంకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు ప్రకటించారు. మిగతా2లో...

## ప్రపంచానికి ఇరాన్
# శుభవార్త

- ●హోర్ముజ్ జలసంధి తెరిచి ఉంటుందని ప్రకటన
- ●ఇరాన్ ప్రకటనతో భారీగా తగ్గిన ఆయిల్ ధరలు



**టెహ్రాన్,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచా నికి ఇరాన్ శుభవార్త అందించింది. ర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచినట్లు ప్రకటించింది. ఇజ్రాయిల్, లెబనాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు అమాంతంగా పడిపోయాయి. మిగతా2లో...

## తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

- కిషన్ రెడ్డిని కోరిన మంత్రి పొన్నం
- లోక్‌సభలో మాట్లాడిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేం
- మంత్రి పొన్నం లేఖపై డిజిపి శివధర్ రెడ్డి స్పష్టీకరణ




## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

- లోయలో పడ్డ వ్యాన్: పదిమంది దుర్మరణం




## సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

● కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సిఎం ● మరోమారు మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మిగతా2లో...




## వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం
- అనుకూలంగా 278..వ్యతిరేకంగా 211 ఓట్లు
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం

## 30లక్షలకు పైగా ధాన్యం
# సేకరణ చేపట్టండి

కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** 2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి మిగతా2లో...

# మనస్సాక్షిగా మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

దేశ మహిళలకు సాధికారత కల్పించడం అనేది ఒక గొప్ప అవకాశం. వారికి కొత్త అవకాశాలను దూరం చేయకండి. ఈ సవరణ ఏకాభిప్రాయంతో ఆమోదం పొందితే.. దేశంలో మహిళా శక్తి మరింత బలోపేతమవుతుంది. ఫలితంగా.. దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. రండి.. ఈ రోజు మనమందరం కలిసి చరిత్ర సృష్టిద్దాం' అని మోదీ పిలుపునిచ్చారు. మహిళలకు వారి హక్కులు ఇచ్చేందుకు సమయం ఆసన్నమైందని అంతకముందు జరిగిన చర్చ సందర్భంగా మోదీ ప్రసంగించారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు చేసిన సవరణలపై పార్లమెంటులో సవివరమైన, సుదీర్ఘ రీతిలో చర్చ జరుగుతోందన్నారు. ఇప్పటివరకు జరిగిన చర్చలో సదరు బిల్లుపై ఉన్న అపోహలను తొలగించామని, సభ్యుల సందేహాలన్నింటినీ నివృతి చేశామని ఆయన తెలిపారు. ఇది చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య అని, దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్‌ను రాజకీయం చేశారని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఈ బిల్లు లోక్‌సభలో ఓటింగ్‌కు రానున్న నేపథ్యంలో ఎంపీలంతా సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు మోదీ. సభ్యులు సున్నితంగా వ్యవహరించాలని, 'నారీ శక్తి' మనోభావాలను దెబ్బతీయవద్దని కోరారు.నారీ శక్తి వందన్ అధినియమ్‌కు సవరణలు చేసే విషయంపై పార్లమెంట్‌లోచర్చ జరుగుతోంది. నిన్నరాత్రి ఒంటిగంట వరకు చర్చ నడిచింది. బిల్లుల విషయంలో ఉన్న అపోహలను తొలగించేలా ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. నాలుగు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎన్నో రాజకీయాలు జరిగాయి. దేశ జనాభాలో సగ భాగంగా ఉన్నవారు తమ హక్కులను పొందడానికి సమయం ఆసన్నమైంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో వారికి ప్రాతినిధ్యం లేకపోవడం సరికాదు. అన్ని రాజకీయ పార్టీలకు నా విన్నపం ఒక్కటే. పూర్తి పరిశీలన తర్వాత మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకొని ఓటు వేయండి‘ అని ప్రధాని కోరారు. మహిళా శక్తికి సేవచేయడానికి, వారిని గౌరవించేందుకు ఇదొక అద్భుత అవకాశం. మహిళలకు కొత్త అవకాశాలను దూరం చేయొద్దు. చరిత్ర సృష్టించేందుకు ఈ రోజు మనమంతా ఏకమవుదాం‘ అని 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.

---

# 2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళా బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకురండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోందన్నారు. కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోందని, విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయని రాహుల్ గాంధీ అన్నారు. న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం వంటి కీలక రంగాల్లో ఓబీసీలు, దళితులు ఎక్కడున్నారు? దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో వీరు ఎక్కడున్నారు? ఓబీసీలకు అధికారం, భాగస్వామ్యం ఇచ్చేందుకు భాజపా సిద్ధంగా లేదు. తన ప్రాబల్యం తగ్గిపోతోందన్న భయం ఆ పార్టీకి పట్టుకుంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలను భాజపా గౌరవించడం లేదని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. మోదీని పరోక్షంగా ఇంద్రజాలికుడంటూ రాహుల్ వ్యాఖ్యానించడం సభలో గందరగోళానికి కారణమైంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా.. భాజపా సభ్యులు కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. ప్రధాన మంత్రిని అవమానిస్తున్నారని, ఇందుకు రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశంలో కులగణన డిమాండ్‌ను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి కూడా తెలుసు. వాళ్లంత తెలివతక్కువ వాళ్లు కాదు. ఈ బిల్లును విపక్షంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తారని వాళ్లకు తెలుసు. అయినా ప్రధాని రెండు సందేశాలు పంపాలనుకున్నారు. ఇందులో మొదటిది.. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను ఆయన మార్చాలనుకున్నారు. రెండవది.. తాను మహిళా పక్షపాతినని మరోసారి చాటిచెప్పాలని అనుకున్నారు. బాలాకోట్ మెజిషియన్, డీమోనిటైజేషన్ మెజియన్, సిందూర్ మెజిషియన్ అక్షస్మాత్తుగా పట్టుబడ్డారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.ప్రధానమంత్రిని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానిపై అభ్యంతరకరమైన భాష వాడటాన్ని తప్పుపట్టారు. బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్ ప్రస్తావనతో దేశాన్ని, మిలటరీని అవమానపరుస్తున్నారని అన్నారు. దేశ ప్రధానమంత్రి గురించి విపక్ష నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, ఆ వ్యాఖ్యాలను రికార్డులను నుంచి తొలగించాలని స్పీకర్ ఓం బిర్లాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించారు.

---

# ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ రవాణాకు కీలకంగా మారిన హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పంద కాలం ముగిసేవరకూ హోర్ముజ్ పూర్తిగా తెరిచి ఉంటుందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇరాన్ తాజా ప్రకటనతో.. హోర్ముజ్ జలసంధిలో ఇకపై అన్ని వాణిజ్య నౌకలకు ప్రవేశం ఉంటుంది. అంతర్జాతీయ వాణిజ్య రవాణాకు కీలకమైన ఈ జలమార్గంలో వాణిజ్య నౌకల ప్రయాణాలకు మార్గం సుగమమైంది. ఇరాన్, ఇతర దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే ఈ జలమార్గంపై.. కొన్ని నెలలుగా వివాదాలు కొనసాగుతున్నప్పటికీ, కాల్పుల విరమణ సమయం ముగిసేవరకూ.. యథావిధిగా వాణిజ్య రవాణా కొనసాగించవచ్చని ఇరాన్ స్పష్టం చేసింది. కాగా.. హోర్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సుమారు 20 శాతం ప్రపంచ క్రూడాయిల్ సరఫరా అవుతుందన్న విషయం తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మ్యూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మ్యూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడ డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు.ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది.

---

# వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మూడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గట్టెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

---

# సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

(మొదటి పేజీ తరువాయి)

మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ. 29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు.

యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదని హరీశ్‌రావు తెలిపారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు. ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

---

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**చెన్నై,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాన్ లోయలో పడ్డ ఘటనలో 10 మంది చనిపోగా.. మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. కోయంబత్తూరు జిల్లాలోని వాల్పరై ఘాట్ రోడ్డులో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పింది. వేగంగా వెళ్లి లోయలో పడిపోయింది. పైనుంచి కిందపడ్డంతో వ్యాన్ నుజ్జునుజ్జయింది. వ్యానులో ఉన్న పది మంది అక్కడికక్కడే చనిపోయారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు 10 మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై వేగంగా దూసుకు వెళుతున్న కారు టైర్ పేలింది. ఒక్కసారిగా అదుపుతప్పిన కారు.. వేగంగా వెళ్లి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు వేగంగా కారుకు వ్యాపించాయి. కారు, బస్సు మంటల్లో దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరు మంది కాలి బూడిదయ్యారు. బస్సులో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి.

# 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి)

భంగం కలిగించే పోస్టులు ఎలా పెడతారని న్యాయస్థానం ప్రశ్నించింది. వాక్ స్వాతంత్రం, ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం. ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కేంద్రం నుంచి తెలంగాణకు రూ. 1,400 కోట్లు రావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయిలో వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలువురు కేంద్ర మంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.

# తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

**హైదరాబాద్,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించే విధంగా భాజపా ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు లోక్‌సభ స్పీకర్‌ను ఒప్పించాలని ఆయన కోరారు. ఎంపీ విషయంలో చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డికి మంత్రి లేఖ రాశారు. ఈ లేఖపై డీజీపీ స్పందించారు. చట్టసభల్లో మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉండదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని మంత్రి మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై చర్చలో ఎంపీ తేజస్వి సూర్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనను ప్రస్తావిస్తూ.. బ్రిటీష్ వాళ్లు చేసిన భారత్- పాకిస్తాన్ విభజనకంటే దారుణంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరే చేశారంటూ ఎంపీ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి.

# రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా...

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

# సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆర్టిజన్లు

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులు ప్రజలను మెప్పించే పనులు చేయాలి, సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసి, వేసవిలో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో ఉంటుంది ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సీఎం తెలిపారు. చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు చేస్తుంది, వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని జేఏసీ నాయకులకు డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించగలిగే సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్కో సిఎండి చర్చలు జరుపుతారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. చర్చల్లో ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆర్టిజన్ల కో చైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తేజస్వీ వ్యాఖ్యలు పార్లమెంట్ ముందు ఎంపిల నిరసన

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని బైఠాయిచారు. తెలంగాణ ఏర్పాటును భారత్ - పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ భాజపా ఎంపీ తేజస్వీ సూర్య లోక్‌సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అవమానించవద్దని ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా కూడా ఎంపీలు నినాదాలు చేశారు. ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, వేం నరేందర రెడ్డి, కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

# టిడబ్ల్యూజెఎఫ్ 'మీడియా డైరీ' ఆవిష్కరణ




**హనుమకొండ,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టిడబ్ల్యూజెఎఫ్ 'మీడియా డైరీ - 2026' ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం రోజున గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడబ్ల్యూజెఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు టి.వి. రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ ముఖ్య అతిథిగా హాజరై డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం టిడబ్ల్యూజెఎఫ్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. మీడియా ప్రతినిధులకు ఈ డైరీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ముఖ్యమైన సమాచారాన్ని ఇందులో పొందుపరచడం అభినందనీయమని ఆయన కొనియాడారు. జర్నలిస్టులు వృత్తిపరమైన విలువలను పాటిస్తూ, సమాజ శ్రేయస్సు కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులుటి.వి.రాజు గౌడ్ మాట్లాడుతూ.. జిల్లా కమిటీ జర్నలిస్టుల అభ్యున్నతికి కట్టుబడి ఉందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా కోశాధికారి ఈ రమేష్ జాయింట్ సెక్రటరీలు మంద రాజేష్, ఈర్ల తిలక్, కార్యవర్గ సభ్యులు వలి, ఎలక్ట్రాన్ మీడియా జిల్లా అధ్యక్షుడు గూడెల్లి నాగేందర్, పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులు గిట్ల అనిల్, కార్యదర్శి దామెర వెంకటేష్, పరకాల నియోజకవర్గం అధ్యక్షులు కోగిల చంద్రమౌళి, సీనియర్ జర్నలిస్టులు అంకేశ్వర రాజేందర్, సత్యం, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.


# కాకతీయ ప్రభుత్వ కళాశాల "తెరపై షేక్స్‌పియర్, దృశ్య రూపకాల విశ్లేషణ" పై జాతీయ సదస్సు



**హనుమకొండ : ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాల (అటానమస్) ఆంగ్ల విభాగం, "తెరపై విలియం షేక్స్‌పియర్ మరియు దృశ్య రూపకాల విశ్లేషణ" అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సును ఈరోజు విజయవంతంగా నిర్వహించింది. ఆంగ్ల సహాయ ఆచార్యులు డా. ఎన్. రమేష్ చంద్ర శ్రీకాంత్, అతిథులకు సాదర స్వాగతం పలికి, సదస్సు గురించి పాల్గొన్నవారికి వివరించారు. అసోసియేట్ ప్రొఫెసర్ మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. టి.ఎస్. ప్రవీణ్ కుమార్, ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. దీని అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ అధ్యక్షోపన్యాసం చేశారు. తన ప్రసంగంలో ప్రొఫెసర్ శ్రీనివాస్, విలియం షేక్స్‌పియర్ మరియు అతని మహోన్నత రచనలైన హామ్లెట్, మాక్‌బెత్, ఒథెల్లో, మరియు కింగ్ లీర్ గురించి అనర్గళంగా మాట్లాడారు. ఆయన ఆ దిగ్గజ నాటక రచయిత యొక్క పాండిత్యాన్ని, ఆయన కాలం తర్వాత 450 సంవత్సరాలు గడిచినా కూడా శక్తివంతంగా ప్రతిధ్వనిస్తున్న ఆయన విశ్వవ్యాప్త ఆకర్షణను ప్రశంసించారు. ఆంగ్ల విభాగ అధిపతి, ఐక్యూఏసి సమన్వయకర్త మరియు ఈ సదస్సు కన్వీనర్ అయిన ప్రొఫెసర్ ఎ. శ్రీనాథ్, ఈ అంశాన్ని క్లుప్తంగా మరియు స్పష్టంగా వివరించారు. వైస్ ప్రిన్సిపాల్-I శ్రీమతి కె. రజనీలత మరియు వైస్ ప్రిన్సిపాల్-II ప్రొఫెసర్ డి. రాజశేఖర్ కూడా సందేశాలు అందించారు. ఎన్ఐటి వరంగల్ నుండి ప్రొఫెసర్ డి.ఎస్. కేశవరావు గౌరవ అతిథిగా ఈ కార్యక్రమానికి విచ్చేసి, "షేక్స్పియర్ మరియు అతని చిక్కుముడి" అనే అంశంపై లోతైన విశ్లేషణను అందించారు. పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తా విశ్వవిద్యాలయం, విద్యాసాగర్ మహిళా కళాశాల, ఆంగ్ల అసోసియేట్ ప్రొఫెసర్ అయిన డాక్టర్ ప్రదీప్త ముఖర్జీ కీలకోపన్యాసం చేశారు. ఆమె "తెరపై షేక్స్పియర్ నాటకాలలో దృశ్య రూపకాల విశ్లేషణ" అనే అంశంపై మాట్లాడారు మరియు తన ఆలోచనలను రేకెత్తించే ప్రదర్శన మరియు సంభాషణ ద్వారా పండితులతో చురుకుగా సంభాషించారు. ఆంగ్ల విభాగ అధ్యాపక బృంద సభ్యులు డా. పి. దినకర్ (అసోసియేట్ ప్రొఫెసర్), డా. ఎన్.ఆర్. రమేష్ చంద్ర శ్రీకాంత్, పి. జయకర్, శ్రీమతి బి. కిరణ్మయి, మరియు డా. జి. రాజేష్ (అసిస్టెంట్ ప్రొఫెసర్లు) ఈ సదస్సు విజయవంతం కావడంలో చురుకుగా పాల్గొని గణనీయంగా తోడ్పడ్డారు. అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు మరియు విద్యార్థులు సదస్సు అంతటా ఉత్సాహంగా పాల్గొని విలువైన అభిప్రాయాలను అందించారు. పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేయబడ్డాయి మరియు గౌరవ అతిథులు, వనరుల వ్యక్తులను సన్మానించారు. ఆంగ్ల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇ. రామ్ భాస్కర్ రాజు ముగింపు ప్రసంగం చేసి, లాంఛనప్రాయంగా వందన సమర్పణ చేశారు. అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం వల్ల ఈ సదస్సు ఘన విజయం సాధించింది.

# మట్టి త్రవ్వకాల నిబంధనల్లో సడలింపు కోరిన బీఆర్ఎస్ సర్పంచులు

## సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌కు వినతి





**కల్లూరు, ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కల్లూరు మండల బీఆర్ఎస్ సర్పంచులు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్‌ను కలిసి మట్టి త్రవ్వకాల నిబంధనల్లో సడలింపు కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. ఇటీవల అక్రమ మట్టి త్రవ్వకాలపై అధికారులు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్న సర్పంచులు, అదే సమయంలో రైతులు తమ పొలాల్లో ఎత్తుపల్లాలు సవరించుకోవడం, గృహ అవసరాల కోసం మట్టిని వినియోగించుకోవడం కష్టంగా మారిందని తెలిపారు. ప్రభుత్వ భవనాల నిర్మాణం, సీసీ రోడ్ల పనులకు అవసరమైన మట్టి సమీకరణలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో రైతులు, గ్రామీణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనల్లో కొంత సడలింపు ఇవ్వాలని కోరారు. ఏదైనా నిబంధనల ఉల్లంఘన జరిగితే తమ అనుమతులను రద్దు చేయవచ్చని సర్పంచులు హామీ ఇచ్చారు. సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఈ అంశంపై సానుకూలంగా స్పందిస్తూ, రెండు మూడు రోజుల్లో తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం సర్పంచుల బృందం సబ్ కలెక్టర్‌ను శాలువాతో సత్కరించింది. ఈ కార్యక్రమంలో లింగాల సర్పంచ్ వేము కృష్ణ, ఎర్రబోయినపల్లి సర్పంచ్ పొట్రూ శ్రీనివాసరావు, చెన్నూరు సర్పంచ్ జీనుగు శ్రీనివాసరావు, పాయపూర్ సర్పంచ్ శ్రీనివాసరావు, ఎర్రబంజర సర్పంచ్ గుగులోత్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గుండి గ్రామంలో 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ కార్యక్రమం..



**కరీంనగర్ జిల్లా ఏప్రిల్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ కార్యక్రమం భాగంగా గుండి గ్రామంలోని అక్షర హై స్కూల్ వద్ద విద్యార్థులతో కలిసి 'అరైవ్ అలైవ్' కార్యక్రమం నిర్వహించారు. రవాణా శాఖల సహకారంతో రామడుగు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాదచారుల భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ, మానవహారం నిర్వహించి ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని విద్యార్థులు సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించగా, సందీప్ కుమార్ మొదటి స్థానం, సునందేశ్వరి రెండవ స్థానం సాధించారు. వీరికి కరీంనగర్‌లో తెలంగాణ ఎడిజీపీ చారు సిన్హా మరియు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కేడిసిలో ఉద్యోగుల సమస్యలపై భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం






**హనుమకొండ : ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** సిసిఇ జెఎసి ఛైర్మన్ డా. సురేందర్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు, కాకతీయ ప్రభుత్వ కళాశాల (అటానమస్), హనుమకొండలో ఈరోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వ అధికారులను కోరుతూ ఈ నిరసన సంఘీభావంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టిజిసిఇజెఎసి ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి. శ్రీనివాస్, టిజిసిజిటిఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. జె. చిన్న, టిజిసిజిటిఎ హనుమకొండ అధ్యక్షుడు డా. వెంకన్న, కార్యదర్శి ఎం. రవికుమార్ తదితర కార్యవర్గ సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వర్గానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా కరువు భత్యం బకాయిలు, పెన్షనర్ల ప్రయోజనాలు, సిపిఎస్ బకాయిలు, పాక్షిక తుది జనరల్ ప్రావిడెంట్ ఫండ్స్ మొత్తాలు మరియు పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సిని వెంటనే విడుదల/ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, త్వరితగతిన పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర స్థాయి ర్యాంకర్ హాసినికి ఘన సన్మానం



**సిరోల్ ఏప్రిల్ 17(పి.సి.డబ్ల్యూ న్యూస్ ):** మండలం ఉప్పరగూడెంలో రాష్ట్ర స్థాయి ర్యాంకర్ హాసినికి ఘన సన్మానంసిరోల్ మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన ఆకోజు శ్రీనివాస్ - అనిత దంపతుల కుమార్తె ఆకోజు హాసిని విద్యలో ప్రతిభ కనబరిచి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో రాష్ట్ర ర్యాంకు సాధించిన హాసిని, సెకండ్ ఇయర్‌లో 991 మార్కులు సాధించి మరోసారి రాష్ట్ర స్థాయి ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కలిసి హాసినిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొండపల్లి శ్రీదేవి, సిరోల్ మాజీ ఎంపీటీసీ భోజనాయక్, తాళ్ల సంకీసా సర్పంచ్ చింతమల రాజు, రైతు కోఆర్డినేటర్ సముద్రాల శ్రీనివాస్, ఉప్పరగూడెం మాజీ సర్పంచ్ కాలం తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ తోట రమేష్, గ్రామ పెద్దలు సముద్రాల బాలయ్య, వార్డు సభ్యులు కాట్రేవుల మహేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. హాసిని భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# మానవసేవే మాధవసేవ: నామోజు నాగలక్ష్మి

● సమాజానికి సేవ చేయాలనే సంకల్పం ప్రతి ఒక్కరిలో ఉండాలి



**ఉప్పల్ ఏప్రిల్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆల్ ఇండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ ( AIVF) ఆధ్వర్యంలో వెంకట్ రెడ్డి నగర్ బస్ స్టాండ్ లో చలివేంద్రం, మజ్జిగ ఏర్పాటు చేసి అందరికీ దాహాన్ని తీరుస్తున్నామని గత ఐదు రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండటంతో, మానవ సేవే మాధవ సేవ అనే భావంతో సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో AIVF సంస్థ ముందుకు వచ్చిందని తెలంగాణ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రామంతపూర్ అధ్యక్షురాలు నామోజు నాగలక్ష్మి అన్నారు. విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులతో మేము చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలని, మనకు తోచిన సహాయాన్ని అందించాలని, ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమంలో ముందుండాలని, వేసవి కాలంలో పక్షులకు జంతువులకు మన ఇండ్లపై నీటిని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమము ఆరు రోజులు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ పబ్లిసిటీ సెక్రటరీ సునీత, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాధవి, ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు విజయలక్ష్మి, ఏఐవిఎఫ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఖబర్దార్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

● ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి



**ములుగు ప్రతినిది ఏప్రిల్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ గారు మంత్రి సీతక్క గారి గురించి చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవి, అసత్య ప్రచారాలపై ఆధారపడి ఉన్నాయని మేము ఖండిస్తున్నాము. సీతక్క గారు ప్రజల అభిమానం, విశ్వాసంతో ఎదిగిన నాయకురాలు. ఆమెపై తప్పుడు ఆరోపణలు చేసి, ఆమె ప్రతిష్టను దెబ్బతీయాలనే ప్రయత్నాలు చేయడం చాలా దురదృష్టకరం. గతంలో మీరు కూడా మంత్రిగా పనిచేసిన సందర్భంలో ప్రభుత్వ పథకాల అమలు, కొనుగోళ్ల విషయాల్లో తీసుకున్న నిర్ణయాలను గుర్తు చేసుకోవాలి. అదే సంస్థల ద్వారా అప్పట్లో కూడా మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదు. టెండర్ ప్రక్రియపై అనవసరంగా తప్పుడు అంకెలను ప్రచారం చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడం సరైన విధానం కాదు. ఎవరైనా అనుమానాలు ఉంటే, చట్టపరమైన విచారణకు మేము సిద్ధంగా ఉన్నాము. ఆదివాసీ మహిళ అయిన సీతక్క గారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మరింత బాధాకరం. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజం, కానీ అవి ఆధారాలతో, గౌరవంతో ఉండాలి. మేము ఎప్పుడూ పారదర్శకతకు, నిజాయితీకి కట్టుబడి ఉన్నాము. ఎలాంటి విచారణకైనా సిద్ధమే. అయితే తప్పుడు ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు మానుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము అని ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి గారు పత్రిక పరంగా తెలియజేశారు.

## అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



**గంగాధర ఏప్రిల్ 17 (పీసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కరీంనగర్ లో ఈరోజు జై వాసవి జై శ్రీ రామ్ ప్రతి అమావాస్య అన్నప్రసాద వితరణ అన్నపూర్ణసేవాసమితి ఆధ్వర్యంలో500 మంది కి అన్నప్రసాద వితరణ శనివారం మార్కెట్ గాంధీరోడ్ లో చేయడం జరిగింది అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు గుండ రవి కైలాస కిషోర్ చిట్టిమల్లప్రశాంత్ వాసవి క్లబ్ కాపుల్స్ కరీంనగర్ అధ్యక్షుడు జిల్లా జగదీష్ అలగంధుల రమన అన్నపూర్ణ సేవాసమితి సభ్యులు పాలుగొన్నారు.

## శ్రీ వాసవి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ



**గంగాధర ఏప్రిల్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు మధురానగర్ చౌరస్తాలో శ్రీ వాసవి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి సుమారు 500 మంది అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి శ్రీ వాసవి అన్నపూర్ణ సేవా సమితి సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేసినారు.

## గోల్డెన్ అవర్ రెస్పాన్స్ పై లింగాల గ్రామంలో శిక్షణ







**కల్లూరు, ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో ఎస్సై హరిత ఆధ్వర్యంలో కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగాల గ్రామంలో గోల్డెన్ అవర్ రెస్పాన్స్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్లూరు వైద్య బృందం సమక్షంలో సీపీఆర్ ప్రథమ చికిత్స, అత్యవసర కాల్స్, పీఎం రహత్ నగదు ప్రోత్సాహం, సామాజిక బాధ్యత, గోల్డెన్ అవర్ రెస్పాన్స్ టైమ్ మొదలైన వాటి గురించి వివరించారు. అదేవిదంగా రహదారి భద్రత, హెల్మెట్, సీటుబెల్టు ప్రాధాన్యతపై ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకపోవడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, అతివేగాన్ని నియంత్రించడం ద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని డ్రైవర్లకు, స్థానిక ప్రజలకు అవగాహనకల్పించారు.లింగాల గ్రామ సర్పంచ్ వేణు కృష్ణ, కల్లూరు సిహెచ్సి వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు వాహనదారులు పాల్గొన్నారు.

## పంటపొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు..

● చెంబకూరు రోడ్డుపై విమర్శలు

**మదనపల్లి ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మదనపల్లి చెంబకూరు మార్గంలో పెంచుపాడు సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడం అదృష్టంగా అదృష్టం ప్రయాణికులు ఊపిరిచుకున్నారు . ఈ ఘటనపై సీపీఐ మండల కార్యదర్శి డి.రెడ్డి శేఖర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మదనపల్లిరామసముద్రం ప్రధాన రహదారి గుంతలతో దెబ్బతిని ప్రమాదకరంగా మారిందని విమర్శించారు.

## ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడి గేదెల పథకానికి ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పొడిగింపు

● జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి అధికారి కె.శ్రీనివాస రావు




**మహబూబాబాద్, ఏప్రిల్.17(పి.సి.డబ్ల్యూ న్యూస్):** జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లి., మహబూబాబాద్ జిల్లా ద్వారా 2025-26 సం. నకు పాడి గేదెల పథకానికి గాను ఆన్ లైన్ దరఖాస్తు తేది 16-04-2026 ముగియడంతో ప్రభుత్వం గడువు తేదీని 23-04-2026 వరకు పొడిగించనైనదని జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి అధికారి కె.శ్రీనివాస రావు నేడు ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ / యువకులు సంబందిత కుల దృవీకరణ పత్రం (తెలంగాణా ఏర్పడిన తరవాత జారీ చేసింది), ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవ ద్వారా జారీ చేసింది). ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, పాస్ పోర్ట్ సైజు పోటో, సదరం సర్టిఫికేట్ (వికలాంగుల కోసం) మరియు పట్టాదారు పాసు పుస్తకం (కనీసం 0.10 గుంటలు), దృవ పత్రాలతో తేది 23-04-2026 వరకు ఆన్ లైన్ (www.tgobmms.cgg.gov.in) నందు దరఖాస్తు చేసుకొని, వెంటనే అట్టి ఆన్లైన్ దరఖాస్తుకు సంబంధిత దృవ పత్రాలను జత పరిచి (హార్డ్ కాపీ), (గ్రామీణ ప్రాంతం వారు సంబంధిత ఎంపీడీవో కార్యాలయము నందు మరియు పట్టణ ప్రాంతం వారు సంబంధిత మునిసిపాలిటి కార్యాలయము నందు సమర్పించాలని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు (02) పాడి గేదెలను అందజేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

## వారంలో ఒకరోజు ఫ్రైడే ఫ్రైడేగా నిర్వహించుకోవాలి: డిసీ శ్రీహరి

● ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ మలేరియా నియంత్రణ...




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఏప్రిల్,16,(పిసీడబ్ల్యూ న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 లో భాగంగా కాప్రా సర్కిల్ పరిధిలోని కెసిఆర్ కాలనీలో శుక్రవారం డిసి,శ్రీహరి డిఈ,రవీందర్,ఏఈ,డి రమేష్ ఎంటమాలజీ, సానిటేషన్ సిబ్బంది తో కలిసి ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డిసి శ్రీహరి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తోనే డెంగ్యూ, మలేరియా,రోగాలను నియంత్రించవచ్చని కాలనీలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని పలు సలహాలు సూచనలు సూచించారు. కాలనీలో ఏర్పాటు చేసిన దోమ జీవన విధానంపై అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ డి.రమేష్ మాట్లాడుతూ ఎండాకాలంలో ఎక్కువ చల్లదనం కోసం కూలర్ లను వినియోగిస్తుంటము కనుక కూలర్ల లోని నీటిని రోజు విడిచి రోజు మార్చుకొని వినియోగించుకుంటే రోగాల బారిన పడకుండా సంరక్షించుకున్న వాళ్లమవుతావని సూచించారు.ఈ కార్యక్రమానంతరం కేసీఆర్ కాలనీ లోని ఇండ్లను డిసి, డిఈ,అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ డి.రమేష్ ఆధ్వర్యంలో పలు ఇండ్లలోని కూలర్లను పరిశీలించి కూలర్లలోని లార్వాను తొలగించడం జరిగింది.ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఎస్ సుదర్శన్,ఎంటమాలజీ, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● ఉపాధ్యాయులు మరియు ఉద్యోగుల సమస్యలపై తహసిల్దార్‌కు వినతి పత్రం




**గంగాధర ఏప్రిల్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగులో ఈరోజు టి జి ఈ జె ఏ సి ఆధ్వర్యంలో ఎస్ జి టి యు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ కే మహిపాల్ రెడ్డి పిలుపుమేరకు ఉద్యమ కార్యాచరణలో భాగంగా స్థానిక ఎమ్మార్వోలకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమంలో ఎస్ జి టి యు యూనియన్ భాగస్వామ్యంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. జిల్లా అధ్యక్షుడు శ్రీ ఉకంటి విజేందర్ రెడ్డి రామడుగు గౌరవనీయులు ఎమ్మార్వో శ్రీమతి రాజ్యలక్ష్మి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తర్వాత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్లో ఉన్ననాలుగు డిఏలు విడుదల చేయాలని పిఆర్సి ని తక్షణమే ప్ర కటించాలని, సిపిఎస్ విధానం రద్దు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏకకాలంలో విడుదల చేయాలని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా 16 మండలాలలో ఎస్జీటీయూ బాగా స్వామిగ పక్షంగా పాల్గొనడం జరిగింది. ఇందులో పాల్గొన్న రాష్ట్ర జిల్లా మండల కార్యవర్గ సభ్యులందరికీ పేరుపేరునా అభినందనలు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, తపస్ బాధ్యులు ప్రేమ్చంద్రారెడ్డి ఐలయ్య రెవెన్యూ సంఘం నుండి ఆర్ఐ రాజకుమార్, జి పీఓలు సాయి కిషోర్,కుర్ర బావ పి ర్ టీయూ శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయులు రత్నాకర్ రెడ్డి వెంకటేశ్వర్లు కవిత మేడం విజయలక్ష్మి మేడం సంధ్యారాణి కళావతి సచిరిత సురేఖ, అరవింద మేడం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ కార్యక్రమం

● ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి ● నేడు శనివారం రాయినిగూడెం, సర్వాపురం గ్రామాల్లో 'ప్రజా దర్బార్' కార్యక్రమం: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు మండలం రాయినిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు, సర్వాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో శనివారం సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో ములుగు మండలంలోని సర్వాపురం, రాయిని గూడెం గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాలకు చెందిన ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్ పి, డి ఎఫ్ ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు

## ములుగు జిల్లాలో విచిత్ర ఘటన ఫిర్యాదు చేసిన వ్యక్తిపైనే అధికారుల తనిఖీ!




**ఏటూరునాగారం,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఎక్సైజ్ అధికారుల చర్యలు ప్రశ్నార్థకంగా మారాయి. గుడుంబా అక్రమ విక్రయాలపై వచ్చిన ఫిర్యాదును పరిశీలించడానికి వెళ్లిన అధికారులు, అసలు ఆరోపణలపై దృష్టి పెట్టకుండా ఫిర్యాదు చేసిన వ్యక్తిపైనే తనిఖీలు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.స్థానికుల సమాచారం ప్రకారం, గుడుంబా అమ్మకాలు జరుగుతున్నాయని పేర్కొంటూ 13వ వార్డు నివాసులు కలసి పిటిషన్ సమర్పించారు. ఆ పిటిషన్‌లో సమస్యను తెలియజేసిన వారిలో బోగిరి బాలకృష్ణ (పి.సి.డబ్ల్యూ రిపోర్టర్) కూడా ఉన్నారు.అయితే, విచారణకు వచ్చిన ఎక్సైజ్ అధికారులు అసలు గుడుంబా విక్రయాలపై దృష్టి సారించకుండా, ఫిర్యాదు చేసిన బాలకృష్ణ షాప్ వద్దకే వెళ్లి తనిఖీ నిర్వహించారు. "మీరు గుడుంబా అమ్ముతున్నారని మాకు ఫిర్యాదు వచ్చింది" అంటూ అధికారుల సమాధానం ఇవ్వడం ఆశ్చర్యానికి గురి చేసింది.ఇప్పటికే గుడుంబా సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, ఇప్పుడు ఫిర్యాదు చేసిన వారినే లక్ష్యంగా చేసుకోవడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు స్థానికుల్లో తలెత్తుతున్నాయి.ఈ ఘటనపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, అసలు గుడుంబా వ్యాపారంపై దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

## జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా బొడిగ శీను



**వరంగల్, ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో జర్నలిస్టుల గుర్తింపు, సంక్షేమం కోసం పనిచేసే జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా సీనియర్ కెమెరామెన్ బొడిగ శీను నియమితులయ్యారు. గత రెండు దశాబ్దాలుగా ఎలక్ట్రానిక్ మీడియాలో ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ బాధ్యతను అప్పగించింది.

**బొడిగ శీను ప్రస్థానం – అనుభవం**

అనుభవం గత 20 సంవత్సరాలుగా ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్‌గా విశేష సేవలు.ప్రస్తుతం టీవీ5 కెమెరామెన్‌గా పనిచేస్తున్నారు.అవగాహన ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి.జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉండే ఈ కమిటీ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై నిర్ణయాలు తీసుకుంటుంది.పారదర్శకత, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులను గుర్తించి ప్రభుత్వ గుర్తింపు కార్డులు మంజూరు చేయడం.సంక్షేమం కోసం మీడియా ప్రతినిధుల హక్కులు, సౌకర్యాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకోవడం."అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా నా వంతు కృషి చేస్తానని బొడిగ శీను తెలిపారు.రెండు దశాబ్దాల అనుభవం ఉన్న శీను నియామకం పట్ల వరంగల్, హన్మకొండ జిల్లా పాత్రికేయ సంఘాలు మరియు తోటి జర్నలిస్టులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

**• ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు డిమాండ్**



**తల్లాడ, ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 15 శాతం రిజర్వేషన్లలో వర్గీకరణ ప్రకారం జనాభా ప్రాతిపదికన 11% రిజర్వేషన్లు మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ లోపాల పైన తెలంగాణ గవర్నమెంట్ అనుసరించిన లోపాల పైన ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎస్పి జాతీయ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చెప్పిన విధంగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 15 శాతం రిజర్వేషన్లలో వర్గీకరణ ప్రకారం జనాభా ప్రాతిపదికన 11% రిజర్వేషన్లు మాదిగల కేటాయించాలని కోరారు. అదేవిధంగా మాదిగల జనాభా 10 నుండి 11% ఉంటుందని మా అధినేత మందకృష్ణ మాదిగ మొదటి నుండి చెబుతున్నారు. అది కుల గణన సర్వేతో స్పష్టమైందని అన్నారు. కుల గణన ఇంకా పూర్తిస్థాయిలో శాస్త్రీయంగా జరగలేదని అలా జరిగితే మా జనాభా ఇంకా రెట్టింపు స్థాయిలో పెరుగుతుందనేది నిజమని తెలిపారు. కొంతమంది మేధావుల ముసుగులో జాతికి అన్యాయం చేసే విధంగా కేటాయించిన 9 శాతం రిజర్వేషన్లను స్వాగతించారు. వారు జాతికి ద్రోహం చేశారు అనేది రుజువైందని అన్నారు. పాలకుల మెప్పు కోసం జాతికి అన్యాయం చేసే విధంగా వ్యవహరించిన ద్రోహులకు జాతిలో స్థానం ఉండదని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే సందర్భంలోనే మంద కృష్ణ మాదిగ 11% శాతం వాటా మాదిగలకు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారని అన్నారు. మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రస్తుతం రేవంత్ రెడ్డి మీదనే ఉన్నదని అన్నారు. మాదిగల్లో ఉన్న పేదరికం తొలగించడానికి అన్ని రకాల నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో మాదిగ జాతి మరింత సంఘటితం కావాలని బలమైన శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల అత్యున్నత కమిటీలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ కు చోటు కల్పించినందుకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి యావత్తు మాదిగ జాతి తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది మా జాతికి లభించిన గొప్ప గుర్తింపు, గౌరవం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ పి జిల్లా అధ్యక్షులు తూరుగంటి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్ మాదిగ, ఎంఎస్ పి జాతీయ నాయకులు కొలికపోగు వెంకటేశ్వర్లు మాదిగ, జాతీయ నాయకులు వంగూరి ఆనందరావు మాదిగ, రాష్ట్ర నాయకులు పగిడి కత్తుల ఈదయ్య, రాష్ట్ర నాయకులు చిలకా నాగరాజు, రాష్ట్ర నాయకులు గాజుల నరసింహరావు, జిల్లా నాయకులు కనకం జనార్దన్ మాదిగ, టౌన్ అధ్యక్షులు బాకీ శ్రీను, సూర్యపల్లి నాగేశ్వరరావు, బుట్టి నాగేశ్వరరావు, చాగంటి నరసింహారావు, కర్రీ ఉపేందర్, చిలుముల వెంకటేష్, తోళ్ళ వెంకన్న, తోళ్ళ సురేష్,మర్రికంటి శేఖర్ ఎం7 న్యూస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా రిపోర్టర్ ఆదూరి రవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లు వీగిపోవడం విచారకరం...

**- మహిళలకు మేలు చేసే చట్టంపై ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం..**

**- దశాబ్ద కాలాల కల సాకారం అవుతున్న వేళ ప్రతిపక్షాల కపట బుద్ధి తేటతెల్లమైంది..**

**- మహిళలోకం ప్రతిపక్షాల కపట నీతిని, బుద్ధిని గమనించాలి...**

**- బిజెపి రాష్ట్ర నాయకురాలు, సినీనటి కవిత...**









**కరీంనగర్,ఏప్రిల్17(పీసీడబ్ల్యూ న్యూస్):** నారీ శక్తికి వందనం చేసే నారి శక్తి వందన్ అధినియం అద్భుత చట్టమని, దేశ చరిత్రలోనే మహిళలకు చారిత్రకంగా మిగిలిపోయే బిల్లుకు ప్రతిపక్షాలు అడ్డు తగలడం విచారకరమని, దశాబ్ద కాలాల కల కు ప్రతిపక్షాలు అడ్డుపడి మహిళలను తీవ్రంగా బాధించాయని ,మహిళా లోకం ప్రతిపక్షాల కపట బుద్ధిని గమనించాలని బిజెపి రాష్ట్ర మహిళా నాయకురాలు, సినీనటి కవిత అన్నారు. బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం రోజున నారీ శక్తి వందన్ పాదయాత్ర ను కరీంనగర్ గీతా భవన్ నుంచి కళాభారతి వరకు నిర్వహించి, తదనంతరం కళాభారతిలో మహిళల సమావేశం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి సీనియర్ నాయకురాలు, సినీనటి కవిత మాట్లాడుతూ నారీ శక్తి వందన్ తో చట్టసభల్లో మహిళలకు తగిన గుర్తింపు లభించకుండా ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయన్నారు. ఆడబిడ్డలకు 33 శాతం రిజర్వేషన్లు మోడీ ప్రభుత్వం ఇస్తున్న బహుమానాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేని స్థితికి తెచ్చాయన్నారు. దశాబ్ద కాలంగా మహిళా బిల్లు కార్యరూపం దాల్చలేకపోయిందని, నేడు మోడీ ప్రభుత్వ హయాంలో బిల్లును ఆమోదించడానికి 2023 లోనే తగిన ప్రక్రియను చేపట్టారని తెలిపారు. ప్రధానంగా 2023 లోక్ సభ, రాష్ట్ర శాసనసభల లో మహిళలకు 33 రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్ నారీ శక్తి వందన్ అధినియం ను ఆమోదించిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. నారీ శక్తి వందన్ పై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతాలు, రాజకీయాలు చేయడం సరికాదన్నారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ ప్రాధాన్యం పట్ల ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి లేదనే విషయాన్ని తేట తెల్లంచేస్తుందన్నారు. కేంద్రంలో 2014 లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమం అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందన్నారు. దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎజెండాతో బిజెపికి ముందుకు వెళ్లిందన్నారు. ఆ దిశలోనే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి చర్యలు తీసుకుంటే, బిల్లుకు అడ్డుపడి, 33 శాతం రిజర్వేషన్లు అమలుకాకుండా మహిళలకు తీవ్ర అన్యాయం చేశాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లును వ్యతిరేకించిన ప్రతిపక్షాలకు మహిళలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమము లో మాజీ శాసనసభ్యులు బోడిగే శోభక్క బీజేపీ రాష్ట ప్రధాన కార్యదర్శి గుర్రాల నిర్మల దేవి బీజేపీ మహిళ మోర్చ అధ్యక్షులు చొప్పరీ జయశ్రీ ,సాధినేని లావణ్య గుగ్గిల మంజుల, గొట్టిముక్కల ఉమరాణి,పెద్దపల్లి శ్రీలేఖ, తాటి ప్రభావతి,కొలిపక రమ్య,శ్రీ వేముల కవిత, దేవసానీ సరస్వతి,పొన్నం లక్ష్మి,.తెల్ల లక్ష్మి, ఏన్నం లక్ష్మి ,బారి అపర్ణ ,నాంపల్లి రేణుక, కరీంనగర్ మేయర్ కోలాగని శ్రీనివాస్ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణా రెడ్డి ,కార్పో రేటర్లు బీజేపీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# వాహనాలను తనిఖీ చేసిన ఇద్దరు ఎస్ఐలు







**- బస్టాండ్ మూల మలుపు వద్ద ఆటోలో నిలపరాదు, ఎస్సై అంజమ్మ**

**- రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తే అందరూ విధిగా హాజరు కావాలి ఎస్ఐ శివరామకృష్ణ**

**తొర్రూరు ప్రతినిధి ,ఏప్రిల్ 17(పీసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీలో ద్విచక్ర వాహనదారులు ఇంటి నుండి తలకి రక్షణగా హెల్మెట్ ధరించి బయటికి రావాల్సిందిగా పదేపదే గ్రామస్తులకు విన్నవిస్తున్న వాహనదారులు మాత్రం తలకి హెల్మెట్ లేకుండా ఎవరు చూస్తారు అన్నట్లుగా బయటికి వస్తున్నారు. హెల్మెట్ రహిత జిల్లాగా ఏర్పాటు చేయాలని ఎస్పీ డాక్టర్ శబరి పదేపదే గ్రామాలలో బైక్ ర్యాలీలు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ ప్రజల్లో మార్పు మాత్రం రావటం లేదు అనటానికి ఇదొక నిదర్శనంగా మారింది. తొర్రూరు పట్టణంలో బస్టాండ్ వద్ద మరియు అన్నారం రోడ్డు వద్ద ఇద్దరు ఎస్ఐలు వాహనాల తనకి నిర్వహించారు. టి జి ఎస్ ఆర్ టి సి బస్టాండ్ ప్రాంతంలో ఎస్సై అంజమ్మ వాహనదారుల హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారిని మందలించారు. పదేపదే హెల్మెట్ పెట్టుకుని రావాలని హెచ్చరికలు జారీ చేసిన హెల్మెట్ లేకుండా తిరగటం ఇది సరైన పద్ధతి కాదని ఆమె పేర్కొన్నారు. అలాగే వాహనాలు తనిఖీలు సరైన పత్రాలు లేని వారికి మరియు ఆటో డ్రైవింగ్ ఇష్టారాజ్యంగా నడుపుతున్నారని సరైన పద్ధతిలో నడిపే విధంగా చూడాలని ఆటో డ్రైవర్లకు పాలు సూచనలు ఇచ్చారు. దీనితోపాటు టి జి ఎస్ ఆర్ టి సి బస్టాండ్ బస్సులు బయటికి వచ్చే ప్రాంతంలో మూలమలుపు వద్ద ఆటోలు నిలపరాదని పదే పదే చెప్పినప్పటికీ కొందరు ఆటో డ్రైవర్లు బస్సులకు ,ఇతర వాహనాలకి, ప్రయాణికులకు ఇబ్బంది కలిగే విధంగా ఆటోలో నిలుపుతున్నారని మరోసారి ఇక్కడ ఆటోలో నిలిపితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్నారం రోడ్డుమూలమలుపు వద్ద ఎస్సై శివరామకృష్ణ వాహనాల తనిఖీలను నిర్వహించారు వాహనదారులు హెల్మెట్ లేని వారిని మందలించారు. కొన్ని వాహనాలకు ముందు, వెనక నెంబర్ ప్లేట్ లేకపోవడం సరైన పత్రాలు ఉన్నాయా లేదా అని వాటిని పరిశీలించారు ఆటో డ్రైవర్లకి రహదారి భద్రత సూత్రాలను తెలియపరిచేందుకు సమావేశం ఏర్పాటు చేయగా పట్టణంలో 165 ఆటోలు ఉండగా కేవలం 16 మంది మాత్రమే హాజరయ్యారని మరోసారి ఏదైనా సమావేశాన్ని ఏర్పాటు చేస్తే ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ హాజరు కావాలని ఎస్సై కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా తలకు హెల్మెట్లు ధరించి ఇంటి నుండి బయటికి రావాల్సిందిగా పేర్కొంటున్నారు.

## వియం బంజరలో గోల్డెన్ అవర్ రెస్పాన్స్ శిక్షణ

**• రోడ్డు భద్రతపై అవగాహన**

**• కల్లూరు ఎసిపి వసుంధర యాదవ్**





**కల్లూరు, ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** అరైవ్ ఆలైవ్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో వియం బంజర పోలీస్ స్టేషన్ పరిధిలో గోల్డెన్ అవర్ రెస్పాన్స్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వియం బంజర వైద్య బృందం సమక్షంలో సీపీఆర్, ప్రథమ చికిత్స విధానాలు, అత్యవసర కాల్స్ ప్రాముఖ్యత, పీఎం రహత్ నగదు ప్రోత్సాహం, సామాజిక బాధ్యత, గోల్డెన్ అవర్ రెస్పాన్స్ టైమ్ వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా రహదారి భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, సెల్ ఫోన్ ఉపయోగించకుండా డ్రైవింగ్ చేయడం, అతివేగాన్ని నియంత్రించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఎంపీడీఓ, ఆర్ఐ, ఎస్సై వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు, వాహనదారులు పాల్గొన్నారు.

## పాయపూర్‌లో నూతన గ్రామపంచాయతీ భవనం కోసం వినతి



**కల్లూరు, ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలోని పాయపూర్ గ్రామపంచాయతీకి నూతన కార్యాలయ భవనం నిర్మించాలని సర్పంచ్ కోలేటి శ్రీనివాసరావు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత గ్రామపంచాయతీ భవనం పాతదై, సౌకర్యాలు తక్కువగా ఉండటంతో గ్రామ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలంటే ఆధునిక సదుపాయాలతో కూడిన నూతన భవనం అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వినతిపై సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

## అత్యవసర పరిస్థితిలో O+ రక్తదానం డెలివరీ పేషెంట్‌కు ప్రాణదాతగా వెంకన్న



**ములుగు జిల్లా,ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏటూరునాగారం గవర్నమెంట్ ఆసుపత్రిలో శనిగకుంట గ్రామం (మంగపేట మండలం)కు చెందిన అరుణ అనే గర్భిణి మహిళ డెలివరీ సమయంలో అత్యవసర పరిస్థితి నెలకొంది. వెంటనే O+ రక్తం అవసరమైంది. ఈ విషయం తెలిసిన వేణు, పి.సి.డబ్ల్యూ విలేఖరి బాలకృష్ణను ఫోన్ ద్వారా సంప్రదించి సహాయం కోరారు. వెంటనే స్పందించిన బాలకృష్ణ రక్తదాతను ఏర్పాటు చేసి ఆసుపత్రికి పంపించారు. తక్షణమే స్పందించిన బూర వెంకన్న ఆసుపత్రికి చేరుకుని O+ రక్తదానం చేశారు. వెంకన్న చేసిన ఈ సహాయంతో గర్భిణి ప్రాణాపాయం నుంచి బయటపడగా, ఆయన ప్రాణదాతగా నిలిచారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ,"ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.

# హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరుతూ భారీ ర్యాలీ...



**తిమ్మాపూర్,ఏప్రిల్17(పీసీడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ ఉప మండలం లో ఈనెల 18న తలపెట్టిన హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం రోజున అలుగునూరు నుండి కొత్తపల్లి వరకు భారీ వాహన ర్యాలీ చేపట్టారు. సామాజిక సమరత తెలంగాణ ప్రాంత కార్యదర్శి పుల్లూరి రామారావు వాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. తిమ్మాపూర్ ఉప మండలం పరిధిలోని అలుగునూర్, మహాత్మా నగర్, తిమ్మాపూర్, పోరండ్ల, ఇందిరానగర్, నుస్తులాపూర్, కొత్తపల్లి గ్రామాల హిందూ సమ్మేళనాన్ని 18వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటలకు రామకృష్ణ కాలనీలోని సుభాష్ నగర్ ప్రాంతంలో గల శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయ ప్రాంగణం వద్ద ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. హిందువుల ఐక్యత కోసం తలపెట్టిన హిందూ సమ్మేళన కార్యక్రమానికి ఉప మండలం పరిధిలోని ఆయా గ్రామ ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీ అనంతపద్మనాభ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఇట్టి హిందూ సమ్మేళన వేడుకల నిర్వాహన జరుగుతుందని తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే హిందూ సమ్మేళన కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తల సందేశాలు ఉంటాయని తెలిపారు. ఈ ప్రోగ్రాం లో శ్రీ అనంతపద్మనాభ స్వామి ఉత్సవ సమితి కమిటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో ఒక్క బాల్యవివాహం కూడా నమోదుకావద్దు

**- ముందస్తు వివాహం బాలికలకు శాపం**

**- ప్రతి బాలిక ఉన్నతస్థాయికి ఎదిగి స్థిరపడిన తర్వాతనే వివాహం**

**- బాలికా సాధికారతకోసమే స్త్రీ శిశు సంక్షేమశాఖ**

**- బాల్య వివాహాల నియంత్రణకు హెల్ఫ్ లైన్ 1098**

**- జిల్లా సంక్షేమ అధికారిణి డాక్టర్ వేల్పుల విజేత**




**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఈ వేసవి సెలవులలో పిల్లలు ఆనందంగా ఆహ్లాదంగా గడపాలని ఒక్క బాల్య వివాహం కూడా నమోదు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి డాక్టర్ వేల్పుల విజేత అన్నారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సేవా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికలను శుక్రవారం కలెక్టరేట్ లో తన చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్త్రీ శిశు సంక్షేమ శాఖ పరంగా అన్ని రకాల జాగ్రత్తలు చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ కొందరు తల్లిదండ్రులు రకరకాల కారణాలతో తమ పిల్లలకు వివాహ వయసు కంటే ముందస్తు వివాహం చేయడానికి ప్రయత్నించడం శోచనీయమన్నారు. బాలికా సాధికారత కోసం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు అంగన్వాడీల ద్వారా నిరంతర నిఘు, కౌమార బాలికలకు ఆరోగ్య విషయాలపట్ల అవగాహన కార్యక్రమాలు, భేటీ బచావో బేటి పడావో పథకం, సుకన్య సమృద్ధి యోజన తదితర కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామన్నారు. అయినప్పటికీ బాల్యవివాహాలు విషయం ఆందోళనకర కలిగిస్తుందని, చట్టపరమైన నిషేధం ఉన్నప్పటికీ సామాజికంగా ఇంకా మార్పు రావాలని అన్నారు. ప్రతి ముగ్గురిలో కనీసం ఇద్దరు మహిళలు 10వ తరగతి కూడా పూర్తి చేయడం లేదని ఇది మహిళల అభివృద్ధి సామాజిక పురోగతికి పెద్ద అడ్డంకిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వేసవి సెలవుల్లో 0 (సున్నా)బాల్య వివాహాలు నమోదు కావాలని దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బాలల సమస్యలు, బాల్య వివాహాలు గురించి చైల్డ్ లైన్ 1098 కి ఫోన్ చేసి తెలపాలన్నారు. బాలల సంక్షేమ కమిటీ చైర్పర్సన్ భారతరాణి మాట్లాడుతూ... ప్రస్తుత ఆధునిక సమాజంలో బాలికలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని వారు ఎంత చదివితే అంతవరకు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మగ పిల్లలను, ఆడపిల్లలను సమానంగా చూడాలని అది కుటుంబం నుంచే మొదలుకావాలని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దాలని బాల్య వివాహం చేసి వారి జీవితాన్ని అంధకారంలోకి నెట్టివేయడం బాధాకరమైన విషయం అని విచారం వ్యక్తం చేశారు. ముందస్తు వివాహం బాలికలకు శాపంలో మారుతుందని ఆరోగ్యపరంగా సామాజికంగా, కుటుంబ పరంగా మానసిక సమస్యలు, గృహహింస, అవగాహనలేమి అపరిపక్వత వలన జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని అన్నారు. ఖమ్మం జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూసి ప్రతి బాలిక ఉన్నత స్థాయికి ఎదిగి జీవితంలో స్థిరపడిన తర్వాతనే వివాహం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సేవా సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కె శ్రీనివాస్, ఉమెన్ హబ్ బాధ్యులు సమరీన్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్ మండుతున్న ఎండలు

- **ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వాతావరణ శాఖ అధికారులు.**
- **పలు జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**





**తొర్రూరు ప్రతినిధి, ఏప్రిల్ 17(పిసీడబ్ల్యూ న్యూస్):** గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు రాష్ట్రంలోని ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నది. బాబోయ్ మండుతున్న ఎండలు అనే విధంగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూనే ఉన్నాడు. తప్పనిసరిగా వెళ్లాల్సిన వారు తప్ప మిగతా వృద్ధులు చిన్నపిల్లలు వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న ప్రకారంగా ఉదయం 11 గంటల నుండి 3 గంటల వరకు బయటికి రావద్దని. వేడిని భరించుకునే విధంగా శరీరంలో ఎప్పటికప్పుడు తగినన్ని నీరు ఉండేలా చూసుకోవాలని వైద్యులు చెబుతూనే ఉన్నారు. వడ దెబ్బ తగిలినట్టుగా అనిపిస్తే వెంటనే వైద్యుని వద్దకు వెళ్లి చేయించుకోవడం మేలోని సూచిస్తున్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాలలో భగభగమని తన ప్రతాపం చూపిస్తూ గురువారం జగిత్యాల జిల్లాలో 44.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో 44.3, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల్లో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటడం ఇదే తొలిసారి. మరో 2-3 రోజులు తీవ్రమైన వడగాలులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా లో కూడా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు సరైన రక్షణ కల్పిస్తూ వారికి కూడా మంచినీటిని అందుబాటులో ఉంచి పది గంటల వరకు ఇల్లు చేరుకునే విధంగా చూడాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శి సర్పంచులపై ఉంటుందని అన్నారు.

# ఖమ్మం కీర్తిని దేశ స్థాయికి తీసుకెళ్తున్న రగ్బీ యువత!

**రాష్ట్ర శిబిరంలో మెరిసిన నలుగురు**

**యశ్వంత్ జాతీయ జట్టుకు ఎంపిక గర్వకారణం**

**రగ్బీ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు సామినేని తిరుపయ్య, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం శారద, ప్రధాన కార్యదర్శి రఘునాయక్**







**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా రగ్బీ సంఘానికి గర్వకారణమైన సందర్భంగా నిలిచే ఈ ఘనతలో, తెలంగాణ రాష్ట్ర పురుషుల రగ్బీ శిక్షణ శిబిరం2026లో ఖమ్మం నుండి నలుగురు ప్రతిభావంతులైన క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం విశేషమని రగ్బీ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు సామినేని తిరుపయ్య, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం శారద, ప్రధాన కార్యదర్శి రఘునాయక్ లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జె. సాయికిరణ్ (బీపీఈడి), జి. రాహుల్ (బీపీఈడి) ఎం. రాజశేఖర్ (బీపీఈడి) తో పాటు ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్సి మొదటి సంవత్సరం చదువుతున్న బి. యశ్వంత్ తన ప్రతిభతో రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం జిల్లా క్రీడా రంగానికి గర్వకారణంగా నిలిచారన్నారు. యువకుడైన యశ్వంత్ తన అంకితభావం, కఠిన శ్రమ, ఆటపై ఉన్న అభిరుచి ద్వారా జాతీయస్థాయికి చేరుకోవడం ఇతర క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచాడన్నారు. అతను ఏప్రిల్ 19 నుండి 22, 2026 వరకు బీహార్ రాష్ట్రంలోని రాజ్గిర్లో జరగనున్న జాతీయస్థాయి రగ్బీ పోటీలలో తెలంగాణ తరఫున పాల్గొననున్నాడు. ఆటలో మరింతగా రాణించి ఖమ్మం జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. --- **కఠిన శిక్షణతో జాతీయ లక్ష్యం: కోచ్‌లు, ఉపాధ్యాయుల పాత్ర ప్రశంసనీయం**తెలంగాణ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని వోక్సెన్ విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 6 నుండి 17, 2026 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరం క్రీడాకారుల ప్రతిభను మెరుగుపరిచే వేదికగా నిలిచింది. అంతకు ముందు సూర్యాపేటలోని ఎంఎస్‌కే ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఏప్రిల్ 3 నుంచి 5 వరకు జరిగిన 8వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ రగ్బీ 7ఎస్ టోర్నమెంట్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన 20 మంది ఆటగాళ్లను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో కఠిన శిక్షణ పొందిన క్రీడాకారుల్లో నుండి తుది 12 మంది జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాబోతున్నారు. ఈ విజయానికి కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కీలకంగా నిలిచింది. **క్రీడా స్ఫూర్తితో ముందుకు** "టాకిల్, రక్, స్క్రమ్"లో విజయమే లక్ష్యంగా రగ్బీ ఆటలో ముఖ్యమైన టాకిల్, రక్, స్క్రమ్ వంటి నైపుణ్యాలను సాధన చేస్తూ, ఖమ్మం యువత క్రీడా రంగంలో కొత్త చరిత్ర సృష్టించాలని కోరారు. "గెలుస్తూనే ఉండండిఉ ఖమ్మం, తెలంగాణకు గర్వకారణంగా నిలవండి" అని ఖమ్మం రగ్బీ అసోసియేషన్ అభినందనలు తెలియజేసింది. ఈ విజయ గాథ యువతలో క్రీడలపై ఆసక్తిని పెంచుతూ, భవిష్యత్‌లో మరింత మంది జాతీయస్థాయికి ఎదగడానికి మార్గం సుగమం చేస్తుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# బిజెపి క్షమాపణలు చెప్పాలి

**- బీజేపీ ఎంపీ తేజస్వి తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి**

**- పార్లమెంట్ వద్ద ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి నిరసన**

**- రాష్ట్ర విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరం**

**- ప్లకార్డులు చేతబట్టి కాంగ్రెస్ ఎంపీలతో కలిసి నినాదాలు చేసిన రామసహాయం రఘురాంరెడ్డి**







**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పార్లమెంట్ లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై ద్వేషపూరితంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం పార్లమెంట్ వద్ద తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడటాన్ని భారత్ - పాకిస్తాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ బలిదానాలకు కాంగ్రెస్సే కారణమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా వెనక్కు తీసుకోవాలని, ఇది తెలంగాణ అమరవీరుల త్యాగాలను అవమానపరచడమే అని అన్నారు. బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ పట్ల ద్వేషాన్ని వెళ్ళగక్కారని, పార్లమెంటు రికార్డుల్లో ఈ వ్యాఖ్యలను శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేస్తూ.. " బిజెపి క్షమాపణలు చెప్పాలి", " తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలి" అంటూ..నినాదాలతో హోరెత్తించారు.

# మోడల్ పరీక్షలతో విద్యార్థుల్లో ధైర్యం

**- విజయాల దిశగా ఏఐఎస్ఎఫ్ ముందడుగు**

**- ఒత్తిడిని జయించేందుకు మానసిక స్థైర్యం అవసరం నిపుణుల పిలుపు**

**- ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు దండి సురేష్**







**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని తట్టుకొని విజయాలను సాధించాలంటే మానసిక స్థైర్యం అత్యంత అవసరమని విద్యావేత్తలు పేర్కొన్నారు. ఈ దిశగా విద్యార్థుల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు దండి సురేష్ తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మోడల్ నీట్, ఎంసెట్ పరీక్షలు శుక్రవారం విజయవంతంగా నిర్వహించబడ్డాయి. జిల్లా కేంద్రంలోని స్థానిక డాక్టర్స్ అకాడమీలో మోడల్ ప్రశ్నాపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు దండి సురేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మోడల్ పరీక్షలు రాయడం ద్వారా విద్యార్థులకు అసలు పరీక్షలపై స్పష్టమైన అవగాహన ఏర్పడటంతో పాటు, భయాందోళనలు తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని వివరించారు. గత 26 సంవత్సరాలుగా ఏఐఎస్ఎఫ్ నిర్వహిస్తున్న ఈ మోడల్ పరీక్షలు వేలాది మంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు. పరీక్షల్లో సమయ నిర్వహణ, ప్రశ్నల ఎంపిక వంటి అంశాల్లో ఈ మోడల్ పరీక్షలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ మాట్లాడుతూ, పోటీ పెరుగుతున్న ఈ సమాజంలో కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. ఓటమిని భయపడకుండా దానిని విజయానికి మెట్టు గా భావించాలని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో మోడల్ పరీక్షలు ఒక దిక్సూచి లాంటివని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే విజయాలు సొంతమవుతాయని ఈ కార్యక్రమం మరోసారి స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ సదానందం, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర సమితి సభ్యులు తోట రామాంజనేయులు, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, రాష్ట్ర సమితి సభ్యులు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


# వాంఖడేలో 'డికాక్' విధ్వంసం..



ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియం మరోసారి పరుగుల పండగకు వేదికైంది. పంజాబ్ కింగ్స్‌తో జరుగుతున్న కీలక పోరులో ముంబై ఇండియన్స్ బ్యాటర్లు శివాలెత్తారు. ముఖ్యంగా ఓపెనర్ క్వింటన్ డికాక్ తనదైన శైలిలో విధ్వంసం సృష్టించడంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్‌కు ఓపెనర్ క్వింటన్ డికాక్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. ఇన్నింగ్స్ మొదటి ఓవర్ నుంచే పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడిన అతను, మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. అద్భుతమైన టైమింగ్‌తో ఆడుతూ కేవలం కొద్ది బంతుల్లోనే సెంచరీ మార్కును అందుకున్నాడు. మొత్తం 112 పరుగులు చేసిన డికాక్, వాంఖడే ప్రేక్షకులను తన బ్యాటింగ్‌తో ఉర్రూతలూగించాడు. డికాక్ ఒకవైపు పంజాబ్ బౌలర్లను ఊచకోత కోస్తుంటే, మరోవైపు యువ ఆటగాడు నమన్ ధిర్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కీలక సమయంలో క్రీజులోకి వచ్చిన నమన్, 50 పరుగులతో అర్ధసెంచరీ సాధించి ముంబై భారీ స్కోరు సాధించడంలో తన వంతు సహకారం అందించాడు. వీరిద్దరి దూకుడుతో ముంబై స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో స్టార్ పేసర్ అర్షదీప్ సింగ్ మరోసారి తన సత్తా చాటాడు. ముంబై బ్యాటర్లు అటాకింగ్ చేస్తున్నప్పటికీ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో 3 వికెట్లు పడగొట్టి ముంబైని కొంతవరకు నియంత్రించాడు. మిగిలిన బౌలర్లలో జాన్సన్ మరియు శశాంక్ తలో వికెట్ తీసుకున్నారు. అయితే, డికాక్ సెంచరీ దాటికి పంజాబ్ బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. విజయానికి 196 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగనున్న పంజాబ్ కింగ్స్‌కు ఇది కచ్చితంగా సవాల్‌తో కూడుకున్నదే. వాంఖడే పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో సెకండ్ ఇన్నింగ్స్‌లో పంజాబ్ బ్యాటర్లు ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. భారీ ఛేజింగ్‌ను ఎదుర్కోవడంలో పంజాబ్ ఓపెనర్ల పాత్ర కీలకం కానుంది.

# కోహ్లీని కాదని ప్రదీప్ సాంగ్వాన్‌ను తీసుకున్న ఢిల్లీ

టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంటే ఇప్పుడు ఒక బ్రాండ్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు అతను వెన్నెముక. అయితే, 2008లో జరిగిన మొట్టమొదటి ఐపీఎల్ వేలంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్ (ప్రస్తుత ఢిల్లీ క్యాపిటల్స్) కోహ్లీని కాదని ప్రదీప్ సాంగ్వాన్‌ను ఎంచుకోవడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ఆ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను వెల్లడించాడు. జట్టులో బ్యాటర్లు ఎక్కువగా ఉండటం వల్లే కోహ్లీని తీసుకోలేకపోయామని సెహ్వాగ్ స్పష్టం చేశారు. సెహ్వాగ్ మాటల ప్రకారం.. 2008లో ఢిల్లీ జట్టులో ఓపెనర్లుగా తాను, గౌతమ్ గంభీర్ ఉండేవాళ్లమని, తమ టీమ్‌లోనే శిఖర్ ధావన్, తిలకరత్న దిల్షాన్ కూడా ఉన్నారని గుర్తు చేశాడు. వారు కూడా ఓపెనర్లే అయినప్పటికీ, తాను గంభీర్ ఓపెనింగ్ చేయడం వల్ల వారిని మూడు, ఐదు స్థానాల్లో ఆడించాల్సి వచ్చేదని తెలిపాడు. నాలుగో స్థానంలో మనోజ్ తివారీ ఉండేవాడని, ఇలా టీమ్ మొత్తం టాప్ ఆర్డర్ బ్యాటర్లతో నిండిపోయిందని పేర్కొన్నాడు. ఆ సమయంలో విరాట్ కోహ్లీ కూడా టాప్ ఆర్డర్‌లోనే బ్యాటింగ్ చేసేవాడని, అతన్ని ఎక్కడ ఆడించాలో తమకు అర్థం కాలేదని సెహ్వాగ్ వివరించాడు. జట్టులో బ్యాటింగ్ విభాగం బలంగా ఉన్నా, బౌలింగ్ లో లోటు



ఆ సమయంలో కనిపించిందని సెహ్వాగ్ అన్నాడు. విరాట్ కోహ్లీని టీమ్‌లోకి తెచ్చేంత ఖాళీ తమ బ్యాటింగ్ లైన్ అప్‌లో లేదని, తమకు అప్పుడు ఒక మంచి బౌలర్ అవసరం పడిందని తెలిపాడు. అందుకే కోహ్లీని వదిలేసి ఎడమచేతి వాటం పేసర్ ప్రదీప్ సాంగ్వాన్‌ను తీసుకోవాలని నిర్ణయించుకున్నామని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. ఆ వేలంలో ఆర్సీబీ కోహ్లీని కేవలం రూ. 12 లక్షలకే దక్కించుకుంది. ఆ తర్వాత కోహ్లీ చరిత్ర సృష్టించడం అందరికీ తెలిసిందే. ఇక వేలం సమయంలో ఢిల్లీకి సెహ్వాగే కెప్టెన్ గా ఉండి, జట్టు మేనేజ్మెంట్ నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. మరోవైపు గత 19 ఏళ్లుగా కోహ్లీ ఒకే జట్టు తరపున ఆడుతుండటం విశేషం. ఢిల్లీ వదులుకున్న కోహ్లీ, బెంగళూరు జట్టుకు ప్రాణప్రదంగా మారాడు. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 272 మ్యాచ్‌లు ఆడిన విరాట్ ఏకంగా 8,889 పరుగులు సాధించాడు. ఇందులో 8 సెంచరీలు, 65 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కోహ్లీ రికార్డు నెలకొల్పాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో కూడా కోహ్లీ తన విశ్వరూపం చూపిస్తున్నాడు. ఐదు మ్యాచ్‌ల్లోనే రెండు హాఫ్ సెంచరీలతో కలిపి 228 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో అందరికంటే ముందున్నాడు. ఒకవేళ ఆరోజు ఢిల్లీ కోహ్లీని తీసుకుని ఉంటే, ఆ టీమ్ చరిత్ర మరోలా ఉండేదని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. ఇక ఐపీఎల్ మొదలై 19 ఏళ్లు గడుస్తున్నప్పటికీ గతేడాదే ఆర్సీబీ తొలి టైటిల్ నెగ్గగా, ఢిల్లీ మాత్రం ఇప్పటివరకు రన్నరప్ తో సరిపెట్టుకుంది.

# గుజరాత్ టైటాన్స్‌కు బిగ్ షాక్..

- టోర్నీ నుంచి టామ్ బాంటన్ ఔట్!




ఐపీఎల్ 2026 సీజన్ మధ్యలో గుజరాత్ టైటాన్స్ జట్టుకు బిగ్ షాక్ తగిలింది. ఆ జట్టులోని స్టార్ ప్లేయర్, జోస్ బట్లర్ దేశస్థుడైన ఇంగ్లాండ్ బ్యాటర్ టామ్ బాంటన్ గాయం కారణంగా ప్రస్తుత సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. వేలి గాయంతో బాధపడుతున్న టామ్ బాంటన్ టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడని ఐపీఎల్ అధికారికంగా శుక్రవారం ప్రకటించింది. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో జరగనున్న కీలక మ్యాచ్‌కు ముందు ఈ వార్త శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ జట్టును కలవరపెడుతోంది.టామ్ బాంటన్ స్థానాన్ని భర్తీ చేసేందుకు గుజరాత్ టైటాన్స్ వేగంగా పావులు కదిపింది. దక్షిణాఫ్రికాకు చెందిన యువ వికెట్ కీపర్, బ్యాటర్ కానర్ ఎస్టర్‌హుజెన్‌ను బాంటన్ రీప్లేస్‌మెంట్‌గా జట్టులోకి తీసుకుంది. కేవలం రూ. 75 లక్షల బేస్ ధరతో ఎస్టర్‌హుజెన్ గుజరాత్ జట్టులో చేరాడు. 24 ఏళ్ల ఈ యువ ప్లేయర్ ఐపీఎల్‌లో అడుగుపెట్టడం ఇదే తొలిసారి. టామ్ బాంటన్ దూరం కావడంతో వచ్చిన లోటును ఈ యువ సంచలనం ఏ మేరకు భర్తీ చేస్తాడన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దక్షిణాఫ్రికా క్రికెట్‌లో కానర్ ఎస్టర్‌హుజెన్ స్టార్‌గా పేరు తెచ్చుకున్నాడు. గత నెలలో న్యూజిలాండ్‌తో జరిగిన 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ద్వారా కానర్ ఎస్టర్‌హుజెన్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఎస్టర్‌హుజెన్.. రెండుసార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులను గెలుచుకోవడమే కాకుండా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా కూడా నిలిచాడు. దక్షిణాఫ్రికా 1-2తో వెనుకబడిన స్థితి నుంచి సిరీస్‌ను 3-2తో గెలవడంలో అతను కీలక పాత్ర పోషించాడు.ఐపీఎల్ టోర్నమెంట్ అత్యంత కీలక దశకు చేరుకుంటున్న సమయంలో ఈ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. గుజరాత్ టైటాన్స్ తమ తదుపరి మ్యాచ్‌ను అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆడనుంది. ఈ హోమ్ మ్యాచ్‌కు ముందే కొత్త ఆటగాడు జట్టుతో చేరనుండటం గిల్ సేనకు కొంత ఊరటనిచ్చే విషయమే. దక్షిణాఫ్రికాలో తన సత్తా చాటిన ఈ యువ హిట్టర్, భారత గడ్డపై ఐపీఎల్ అరంగేట్రంలో ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో చూడాలి.

# హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ ఆశించిన స్థాయిలో లేదు

### హార్దిక్ పాండ్యాపై మనోజ్ తివారీ విమర్శలు

ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా ముంబై ఇండియన్స్ జట్టు వరుస పరాజయాలతో సతమతమవుతోంది. ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో కేవలం ఒకే ఒక్క విజయాన్ని నమోదు చేసిన ముంబై ఇండియన్స్.. పాయింట్ల పట్టికలో అట్టడుగు నుంచి రెండో స్థానంలో ఉంది. గురువారం పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కూడా ఘోరంగా ఓడిపోవడంతో కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం మార్చి 29న కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుపై మాత్రమే ముంబై ఇండియన్స్ విజయం సాధించింది.ముంబై ఇండియన్స్ వైఫల్యాలపై మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ ఘాటుగా స్పందించారు. హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ ఆశించిన స్థాయిలో లేదని.. జట్టును ముందుండి నడిపించడంలో హార్దిక్




విఫలమవుతున్నాడని విమర్శించారు. రోహిత్ శర్మ సారథ్యంలో ముంబై జట్టు 2013 నుంచి 2023 మధ్య 5 ట్రోఫీలను గెలుచుకుందని గుర్తు చేసిన మనోజ్ తివారీ.. రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించడం ద్వారా ఫ్రాంచైజీ పెద్ద అన్యాయం చేసిందని అభిప్రాయపడ్డారు."హార్దిక్ పాండ్యా తనంతట తానుగా కెప్టెన్సీ బాధ్యతల నుంటి తప్పుకుని, తిరిగి రోహిత్ శర్మకు పగ్గాలు అప్పగించాలి" అని మనోజ్ తివారీ సూచించారు. గత రెండేళ్లుగా ముంబైకి ట్రోఫీ రాలేదని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఈ ఏడాది కూడా అదే పునరావృతమయ్యేలా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జట్టులో ఐకమత్యం లోపించిందని, కెప్టెన్ నిర్ణయాలు సరిగ్గా లేవని ఆయన కుండబద్దలు కొట్టారు.పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ తీసుకున్న నిర్ణయాలను మనోజ్ తివారీ తప్పుబట్టారు. విధ్వంసకర బ్యాటర్ షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్‌ను కాదని, హార్దిక్ తనను తాను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు ప్రమోట్ చేసుకోవడం వల్ల జట్టు నష్టపోయిందని విమర్శించారు. అలాగే జస్ప్రీత్ బుమ్రాతో మొదటి ఓవర్ వేయించకపోవడం.. ఫామ్‌లో లేని దీపక్ చాహర్‌కు బంతిని ఇవ్వడం వంటి వ్యూహాత్మక లోపాలు ముంబై ఓటమికి కారణమయ్యాయని ఆయన విశ్లేషించారు.

# కోహ్లీ ఒక్క లైక్‌తో సోషల్ మీడియాలో ట్రెండ్





ఒకే ఒక్క లైక్... సోషల్ మీడియానే షేక్ చేస్తోంది. ఇండియన్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తాజాగా మోడల్ లిజ్‌లాజ్ పోస్ట్ లైక్ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై నెటిజన్లు నెట్టింట మీమ్స్‌తో హల్చల్ చేస్తున్నారు. ఒక్కసారిగా సదరు మోడల్ పేరు నెట్టింట ట్రెండ్ అయిపోయింది. ఇన్‌ఫ్లుయెన్సర్ లిజ్‌లాజ్ ఫోటోలతో కూడిన పోస్టును కోహ్లీ లైక్ చేయడం వైరల్‌గా మారింది. ఆమెను ఫాలో కానప్పటికీ లైక్ కొట్టడం చర్చనీయాంశమైంది. జర్మనీకి చెందిన ఈమె 'గోల్డెన్ అవర్ షాట్స్' అంటూ తన ఫోటోలను షేర్ చేసింది. జనవరి 30న పెట్టిన ఈ పోస్టుకు కోహ్లీ లైక్ కొట్టినట్లు కనిపించింది. దీన్ని ఆయన అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. అయితే, ఇది అనుకోకుండా జరిగిందా అల్గారిథమ్ వల్ల జరిగిందా అంటూ డిబేట్ మొదలెట్టారు. కొందరు ఫన్ ఎమోజీస్‌తో నింపేశారు. అసలు ఆమె ఎవరు అంటూ తెగ సెర్చ్ చేస్తున్నారు. లిజ్ లాజ్ జర్మనీకి చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్. సగం సౌతాఫ్రికాకు చెందిన మూలాలు కూడా ఉన్నాయి. ఎంఎస్సీ సైకాలజీ కంప్లీట్ చేసింది. వ్లోగర్, సింగర్‌గా తన ఇన్ స్టా ఐడీని పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ... ట్రావెల్ వ్లాగ్స్, లైఫ్ స్టైల్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు షేర్ చేస్తుంటుంది.ఆర్సీబీకి ఫ్యాన్స్ అంటూ తాజాగా ఓ వీడియోను తన ఇన్ స్టా స్టోరీలో పెట్టుకుంది. సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అద్వైత్ వైద్య ఆమెతో ఫోటో షూట్ చేయగా... వాటిని ఇన్ స్టాలో షేర్ చేశారు. ఇప్పటివరకూ లిజ్‌లాజ్‌కు దాదాపు 4.27 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. 274 పోస్టులు చేశారు. సాక్షాత్తూ భారత క్రికెట్ లెజెండ్ ఆమె పోస్టుకు లైక్ చేయడంతో ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు. లిజ్ లాజ్ జర్మనీకి చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్. సగం సౌతాఫ్రికాకు చెందిన మూలాలు కూడా ఉన్నాయి. ఎంఎస్సీ సైకాలజీ కంప్లీట్ చేసింది. వ్లోగర్, సింగర్‌గా తన ఇన్ స్టా ఐడీని పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ... ట్రావెల్ వ్లాగ్స్, లైఫ్ స్టైల్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు షేర్ చేస్తుంటుంది. ఆర్సీబీకి ఫ్యాన్స్ అంటూ తాజాగా ఓ వీడియోను తన ఇన్ స్టా స్టోరీలో పెట్టుకుంది. సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అద్వైత్ వైద్య ఆమెతో ఫోటో షూట్ చేయగా... వాటిని ఇన్ స్టాలో షేర్ చేశారు. ఇప్పటివరకూ లిజ్‌లాజ్‌కు దాదాపు 4.27 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. 274 పోస్టులు చేశారు. సాక్షాత్తూ భారత క్రికెట్ లెజెండ్ ఆమె పోస్టుకు లైక్ చేయడంతో ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు.




# నా రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొడతాడు

### గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్

టీమిండియా స్టార్ క్రికెటర్, గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో అత్యంత కీలక విషయం క్లారిటీ అని వాషింగ్టన్ సుందర్ పేర్కొన్నారు. స్టేడియంలోకి వెళ్లే ముందే ప్రతి ఆటగాడికి తన బాధ్యత ఏంటో.. కెప్టెన్ తన నుంచి ఏం ఆశిస్తున్నాడో గిల్ చాలా స్పష్టంగా వివరిస్తాడని సుందర్ చెప్పుకొచ్చాడు. ఈ విధానం వల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గి, ప్రశాంతంగా తమ సహజసిద్ధమైన ఆటను ఆడగలుగుతున్నారని పేర్కొన్నాడు.భారత క్రికెట్‌లో ప్రస్తుతం సెన్సేషన్‌గా మారిన బీహార్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ గురించి వాషింగ్టన్ సుందర్ గొప్పగా మాట్లాడాడు. టీ20 క్రికెట్‌లో భారత్ తరపున అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా తన పేరిట ఉన్న రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొట్టే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డాడు. వైభవ్ వయసు తక్కువైనా అతని ఆలోచనా విధానం, నైపుణ్యం చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుందని, అతడు భవిష్యత్తులో టీమిండియాకు సుదీర్ఘ కాలం ఆడుతాడని వాషింగ్టన్ సుందర్ ఆశాభావం వ్యక్తం చేశాడు.



# చిరాగ్ పాశ్వాన్‌తో ఎలాంటి రిలేషన్ లేదు

**క్లారిటీ ఇచ్చిన నటి కంగనా రనౌత్**

కంగనా రనౌత్, చిరాగ్ పాశ్వాన్ ఆ ఇద్దరూ ఇప్పుడు ఫుల్ బిజీ అయ్యారు. పబ్లిక్ ఈవెంట్స్‌లో తరుచూ కనిపిస్తున్నారు. దీంతో కొందరు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఆ ఎంపీలు ఇద్దరూ రొమాంటిక్ రిలేషన్‌లో ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫిల్మ్ స్టార్ , ఎంపీ కంగనా రనౌత్ క్లారిటీ ఇచ్చారు. ఆ రూమర్స్‌కు ఆమె చెక్ పెట్టారు. చిరాగ్ పాశ్వాన్ కేవలం ఫ్రెండ్ మాత్రమే అని ఆమె చెప్పారు. తమ మధ్య రొమాన్స్ లేదని కంగనా పేర్కొన్నది. తమ మధ్య చాన్నాళ్ల పరియం ఉందని, పదేళ్ల క్రితం ఇద్దరం కలిసి సినిమా తీశామని, ఒకవేళ తమ మధ్య ప్రేమాయణం సాగి ఉంటే, మాకు పిల్లలు పుట్టేవారని కంగనా రనౌత్ పేర్కొన్నది. పాశ్వాన్‌తో తన రిలేషన్ చాన్నాళ్ల నుంచి అలాగే ఉందన్నారు. ఒకవేళ తనకు రొమాన్స్ కావాలనుకుంటే, అది జరిగేదని, కానీ అలాంటిది ఏమీ లేదని, అది కేవలం ఫ్రెండ్లీ పరిచయం మాత్రమే అని, అతను కూడా ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వచ్చాడని, అందుకే తమ మధ్య పరిచయం కాస్త చనువుగా ఉంటుందని ఆమె అన్నారు. 2011లో రిలీజైన మిలే నా మిలే హమ్ చిత్రంలో కంగనా, చిరాగ్ పాశ్వాన్ కలిసి నటించారు. తన్వీర్ ఖాన్ ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఆ తర్వాత ఇద్దరూ రాజకీయాల్లో రాణించారు. కానీ కంగనా అడపాదడపా చిత్రాల్లో నటిస్తోంది. చివరిసారి ఆమె ఎమర్జెన్సీ చిత్రంలో యాక్ట్ చేశారు.




# సంక్రాంతికి వస్తున్నాం.. నాకెంతో ప్రత్యేకం

విక్టరీ వెంకటేష్ హీరోగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్ బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులను సృష్టించడమే కాకుండా తాజాగా ప్రతిష్టాత్మక అవార్డును కూడా సొంతం చేసుకుంది. ముంబైలో జరిగిన ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డుల వేడుకలో అనిల్ రావిపూడి తెలుగు విభాగంలో 'ఉత్తమ దర్శకుడు' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కెరీర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా అత్యంత ప్రత్యేకమైనదని తెలిపాడు. కేవలం రూ.50 కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, పెట్టిన పెట్టుబడికి ఆరు రెట్ల లాభాలను తెచ్చిపెట్టడం ఒక దర్శకుడిగా తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ సినిమాకు కమర్షియల్ సక్సెస్‌తో పాటు విమర్శకుల ప్రశంసలు మరియు జాతీయ స్థాయి అవార్డు దక్కడం పట్ల అనిల్ రావిపూడి హర్షం వ్యక్తం చేశారు.


# టీవీ చుట్టూ అల్లిన పల్లెటూరి కథ

టీవీలు అప్పుడప్పుడే ఊళ్లలోకి ప్రవేశిస్తున్న 90వ దశకం నేపథ్యంలో తిమ్మరాజుపల్లి అనే పల్లెటూళ్లో జరిగే కథ ఇది. శివరాత్రి వచ్చిందంటే ఊరి వాళ్లంతా కలిసికట్టుగా చందాలేసుకుని పండగ ఘనంగా జరిపించడం.. ఆ సాయంత్రం అద్దెకి తెచ్చుకున్న టీవీలో కొత్త సినిమాలు చూసి ఆనందించడం పరిపాటి. అలాంటి ఊళ్లోకి తొలిసారి సొంతంగా ఓ టీవీ కొనుక్కుని తెచ్చుకుంటాడు రాజప్ప (ప్రదీప్ కొట్టె). ఎప్పుడైతే ఆ ఇంట్లోకి టీవీ వచ్చిందో.. అప్పటి నుంచి ఊరి వాళ్ల బుల్లితెర వినోదాలకు రాజప్ప ఇల్లు చిరునామాగా మారిపోతుంది. ఆ ఊళ్లో చిల్లర దొంగతనాలు చేస్తూ గడిపేసే సతీష్ (సాయితేజ్) కూడా టీవీ చూడటానికని వచ్చి.. రాజప్ప చెల్లి శారద (వేద జలంధర్)తో ప్రేమాయణం సాగిస్తుంటాడు. ఓసారి ఈ ప్రేమ విషయం రాజప్పకి తెలియడంతో పెద్ద గొడవ జరుగుతుంది. సతీష్‌ని తీవ్రంగా అవమానించడంతో.. 'ఏ టీవీని చూసైతే విర్రవీగుతున్నావో దాన్ని లేకుండా చేస్తాన'ని సవాల్ విసురుతాడు. సరిగ్గా అదే రాత్రి రాజప్ప ఇంట్లో టీవీ దొంగతనం జరగడంతో ఆ నింద సతీష్‌పై పడుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? నిజంగా ఆ టీవీని ఎవరెత్తుకెళ్లారు? తనపై నింద తప్పని నిరూపించుకునేందుకు సతీష్ ఏం చేశాడు? ఊరి




పెద్దలిచ్చిన రెండు వారాల గడువు లోపల ఆ టీవీని.. అసలు దొంగల్ని తను కనిపెట్టాడా? లేదా? ఈక్రమంలో తనకెదురైన సవాళ్లేంటి? అన్నది మిగిలిన కథ. ఇప్పుడు అరచేతిలోకి వినోదాలు వచ్చేశాక టీవీ ప్రాధాన్యం ఎవరికీ పెద్దగా తెలియట్లేదు కానీ.. 80-90ల తరానికి టీవీ అంటే ఓ ఎమోషన్. బుల్లితెరతో పెనవేసుకున్న అనుబంధాలు.. దాని చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలు బోలెడన్ని. ఈ 'తిమ్మరాజుపల్లి టీవీ'తో ఆ జ్ఞాపకాల్ని.. ఆ అనుబంధాల్ని మరోసారి గుర్తు చేసే ప్రయత్నం చేశాడు దర్శకుడు మునిరాజ్. మలయాళ సినిమాల్లోలా చాలా సింపుల్ లైన్‌పై నడిచే చిత్రమిది. ఈ కథ ప్రధానంగా ఓ టీవీ దొంగతనం చుట్టూ తిరుగుతుంటుంది. సింగిల్ లైన్ కథలతో ప్రేక్షకుల్ని రెండు గంటల పాటు థియేటర్లలో కూర్చోబెట్టడం అంత తేలికేం కాదు. కథలో బలమైన డ్రామా పండినప్పుడే అది సాధ్యం. ఈ విషయంలో 'తిమ్మరాజుపల్లి టీవీ' పాసైంది. దర్శకుడు ఈ కథకి ఎలాంటి కమర్షియల్ హంగులు జోడించకుండా చాలా నిజాయితీగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఆ ఊరివాళ్ల మనస్తత్వాల్ని.. అక్కడి సంస్కృతి, సంప్రదాయాల్ని పరిచయం చేస్తూ కథని ఆరంభించిన తీరు బాగుంటుంది. నాయకానాయికల ప్రేమకథ ఎప్పుడైతే రాజప్పకి తెలుస్తుందో.. అక్కడి నుంచి కథలో సంఘర్షణ మొదలవుతుంది. ఇక తన ఇంట్లో టీవీ దొంగతనానికి గురైనప్పటి నుంచి కథ మరింత రసవత్తరంగా మారుతుంది. ఈక్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ఫర్వాలేదనిపిస్తాయి. తెరపై కనిపించేదంతా కొత్త వాలళైనా ప్రేక్షకులకు అదెక్కడా ఇబ్బందిగా అనిపించదు. నాయకా నాయికలతో పాటు తెరపై కనిపించే ప్రతి పాత్రా సహజమైన నటనతో గుర్తుండిపోతుంది. ఎల్లమ్మ పాత్రతో ఇచ్చిన ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. దర్శకుడు తాను అనుకున్న కథని నిజాయితీగా చెప్పడంలో విజయం సాధించాడు. దీన్ని పూర్తిగా ఓ ప్లలెటూరిలోనే చాలా సహజంగా తెరకెక్కించారు. కిరణ్ అబ్బవరం నిర్మాతగా తొలి ప్రయత్నంలో చాలా తక్కువ బడ్జెట్‌లో ఆహ్లాదభరితమైన సినిమా చూపించగలిగారు. పాటలన్నీ కథలో భాగంగా ఉన్నాయి. నేపథ్య సంగీతం సినిమాకి మంచి ఫీల్‌ని జోడించింది. విజువల్స్ ఆకర్షణగా నిలుస్తాయి.

# త్రివిక్రమ్‌తో ఎన్టీఆర్ మరో సినిమా



ఎన్టీఆర్ వరుసగా భారీ ప్రాజెక్టులతో తన ఫ్యాన్స్‌కు ఫుల్ ట్రీట్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న తారక్, తన తదుపరి చిత్రాన్ని మాటల మాంత్రికుడు శ్రీనివాస్‌తో చేయనున్న విషయం తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అరవింద సమేత వీర రాఘవ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింతగా పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం ఆధ్యాత్మికత, కమర్షియల్ ఎలిమెంట్స్ మేళవింపుతో కూడిన విభిన్న కథాంశంతో తెరకెక్కనుంది. ముఖ్యంగా కుమారస్వామి నేపథ్యం ఉండబోతుందని, విజువల్ వండర్‌గా మలచడానికి త్రివిక్రమ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర అంశం టైటిల్. సోషల్ మీడియాలో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం, ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. టైటిల్‌ను బట్టి చూస్తే, ఈసారి ఎన్టీఆర్‌ను మరింత ఉగ్రరూపంలో, శక్తివంతమైన పాత్రలో చూపించే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ రెండు సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ రావొచ్చని ఫిలింనగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఒకే రోజు త్రివిక్రమ్ ప్రాజెక్ట్ అధికారిక ప్రకటనతో పాటు, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' నుంచి కూడా అప్డేట్ వచ్చే అవకాశం ఉందట. ఈ డబుల్ అనౌన్స్‌మెంట్స్ ఎన్టీఆర్ అభిమానులకు నిజమైన పండుగలా మారనుండడం ఖాయం. ఒకవైపు భారీ యాక్షన్ డ్రామా, మరోవైపు ఆధ్యాత్మిక బ్యాక్‌డ్రాప్‌లో విజువల్ గ్రాండియర్ ఇలా రెండు విభిన్న జానర్లలో సినిమాలు చేయడం ద్వారా తారక్ తన గ్లోబల్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేస్తున్నాడు. మొత్తంగా ఎన్టీఆర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నాడని చెప్పాలి. వరుసగా భారీ ప్రాజెక్టులు, స్టార్ డైరెక్టర్లతో కాంబినేషన్లు, విభిన్న కథలు అన్నీ కలిసి టాలీవుడ్‌లో మరో సెన్సేషన్ సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక ఈ సినిమాలు ప్రేక్షకులను ఎలా అలరిస్తాయో చూడాలి.

# అల్లు అర్జున్ రాకాలో షారూఖ్ ఖాన్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ కమర్షియల్ డైరెక్టర్ అట్లీ కలయికలో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రాకా' పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ అంచనాలను మరింత పెంచుతూ తాజాగా ఒక బిగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అట్లీ ఇప్పటికే షారుఖ్‌తో 'జవాన్' వంటి భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. అదే చొరవతో 'రాకా'లో ఒక కీలకమైన అతిథి పాత్ర కోసం షారుఖ్‌ను అడిగారని, అందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. అల్లు అర్జున్ స్టైలిష్ యాక్షన్, అట్లీ టేకింగ్, దానికి తోడు షారుఖ్ ఖాన్ చరిష్మా తోడైతే ఈ చిత్రం గ్లోబల్ లెవల్‌లో రికార్డులు సృష్టించడం ఖాయమని మేకర్స్ భావిస్తున్నారు. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

